క్లుప్తంగా

3 రోజులపాటు విద్యుత్ అంతరాయం

బైరెడ్డిపల్లె : మండలంలోని తీర్థం, ఆల్లపల్లె, దాసార్లపల్లె, కోట్రీపల్లె, దేవదొడ్డి, కంభంపల్లె, కొత్తూరు, రామసముద్రం, రామాపురంలో మూడు రోజుల పాటు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ హేమచంద్రుడు తెలిపారు. ఈనెల 22, 23, 24వ తేదీలో 220 కేవీ పనులు చేయనున్న దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

బదిలీ హెచ్‌ఎంకు సత్కారం



హెచ్‌ఎంను సత్కరిస్తున్న ఎంఈఓలు సాయిలీల, షేక్‌నౌషాద్

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె ఆదర్శ పాఠశాల నుంచి పాతపేట ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీ పై వెళ్తున్న హెచ్‌ఎం ప్రకాష్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. ఎంఈఓలు సాయిలీల, షేక్ నౌషాద్ మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి ప్రకాష్ తనవంతు కృషి చేశారని, నాడు–నేడు పనులను నాణ్యతా ప్రమాణాలతో చేయించారని ఆయన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి



సరోజమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాతృమూర్తి సరోజమ్మ బుధవారం ఉదయం వృద్ధాప్య సమస్యలతో మృతి చెందారు. ఇది తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మృతురాలి స్వగ్రామమైన వాయల్పాడు మండలం చింతపర్తికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. చంద్రశేఖర్ రెడ్డి కుటుంబాన్ని ఓదార్చారు. చైర్మన్‌తో పాటు పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, పెద్దపంజాణి ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మకీర్తి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, సింగిల్ విండో చైర్మన్ సంపల్లి బాబు రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హరినాథ్, ఎంపీటీసీ సుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సురేష్, పార్టీ నాయకులు నివాళులర్పించారు.

వి.కోట ఎస్‌ఐగా మనోహర్



వి.కోట: వి.కోట ఎస్‌ఐగా బి.మనోహర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ రాంభూపాల్ బదిలీపై వెళ్లడంతో కాణిపాకం నుంచి మనోహర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. మూడు రాష్ట్రాల కూడలైన వి.కోట మండలంలో అంతర్ రాష్ట్ర ముఠాలను అరికట్టడానికి కృషి చేస్తానన్నారు.

ఎంఈఓ 2గా లక్ష్మయ్య



గుడుపల్లె: ఎంఈఓ–2గా లక్ష్మయ్య బుధవారం గుడుపల్లెలో బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని యామగానిపల్లె జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న ఆయన ఎంఈఓ–2గా ఉద్యోగోన్నతి పొందారు.

వేలంలో రూ.1.19 లక్షల ఆదాయం

పుంగనూరు: పట్టణంలోని ఎస్‌ఈబీ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన వాహనాల వేలం పాటల ద్వారా ప్రభుత్వానికి రూ.1.19 లక్షలు ఆదాయం వచ్చినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ వివిధ రకాల మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన 16 వాహనాలను వేలం వేశామన్నారు. వేలం ద్వారా వచ్చిన నిధులను ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని తెలిపారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

పలమనేరు: మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న 19 వలంటీర్ పోస్టులకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే 11మంది మాత్రం హాజరయ్యారు. ఫలితాలను ఈనెల 24న వెల్లడించనున్నట్టు ఇంటర్వ్యూ కమిటీ సభ్యులు ఖాదర్ మొహిదీన్, రవి రెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం



టీచర్లను సత్కరిస్తున్న సహోపాధ్యాయులు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం సన్మానం చేశారు. గతంలో ఇక్కడ హెచ్‌ఎంగా ఉన్న ఫజురుల్లా, ఉపాధ్యాయులు కిరణ్మయి, సుభాషిణి, వెంకటరమణారెడ్డి, నారాయణ రెడ్డి, రాజశేఖర్‌రాజు ఇటీవల బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 దామోదర పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- పలుచోట్ల యోగాపై అవగాహన కార్యక్రమాలు



పలమనేరు : కోర్టులో యోగా చేస్తున్న జడ్జి రవి, సిబ్బంది



కుప్పం రూరల్ : యోగా ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు, (ఇన్‌సెట్) శాంతిపురంలో అధికారులు

పలమనేరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం పలమనేరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక కోర్టులో నిర్వహించిన యోగాడేలో జూనియర్ సివిల్ జడ్జి రవి మాట్లాడారు. యోగా –అనేది తనువుకు, మనసుకు ఆత్మను ఏకం చేసే సాధన అన్నారు. ప్రస్తుత యాంత్రిక యుగంలో యోగా అవసరం చాలా ఉందన్నారు. అనంతరం కోర్టు సిబ్బంది యోగాసనాలు వేశారు.

• ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు, వైస్ ప్రిన్సిపాల్ విజయశేఖరం మాట్లాడారు. యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం కళాశాల యోగా సంఘ సభ్యులు విద్యార్థులు, అధ్యాపకులతో యోగాసనాలు వేయించారు.

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది సూర్య నమస్కారాలు, వివిధ యోగాసనాలను వేశారు. అలాగే, మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మకీర్తి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్, ఏఓ భాస్కర్, విస్తరణాధికారి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వి.కోట: ఎంపీపీ యువరాజు పేర్కొన్నారు. మండలంలోని చింతమాకులపల్లె గ్రామ సచివాలయంలో ఎంపీపీ యువరాజు నేతృత్వంలో యోగా డే నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, గ్రామస్తులు, రైతులు యోగాసనాలు వేయడం అందరి దృష్టినీ ఆకర్షించింది. యోగా ప్రాముఖ్యత గురించి ఎంపీపీ మాట్లాడారు.

బైరెడ్డిపల్లె : యోగసాధన చేస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగాపై ఆయన అవగాహన కల్పించారు. హెచ్‌ఎం గౌహర్‌సుల్తానా, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పం నియోజక వర్గంలో..

కుప్పం: స్థానిక ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలో యోగా ప్రాముఖ్యతను అధ్యాపకులు జగదీష్ బాబు తెలియజేశారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు యోగాసనాలు వేశారు. అధ్యాపకులు భాస్కర్ రెడ్డి, అనిల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కుప్పం రూరల్: కొత్తయిండ్లు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మార్కొండనాయుడు విద్యార్థులతో యోగాడే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 12 శాతం మంది పురుషులు, 19 శాతం మంది స్త్రీలు అధిక బరువుతో బాధపడుతున్నారని, 21.2 శాతం మంది పురుషులు, 23 శాతం మంది మహిళలు అధిక రక్తపోటు కలిగి ఉన్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయన్నారు. వీటి నుంచి బయటపడాలంటే యోగాసనాలు వేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిపురం: మండల సచివాలయంలో సిబ్బందితో కలిసి ఎంపీడీఓ హేమమాలిని యోగాసనాలు వేశారు. మానసిక ఒత్తిళ్లను జయించడానికి యోగాను మించిన మార్గం లేదని చెప్పారు. మండల పరిషత్, వైఎస్‌ఆర్ క్రాంతి పథం, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరు నియోజకవర్గంలో..

పుంగనూరు: నిత్య జీవితంలో యోగా చేసే వారు ఆరోగ్యవంతులుగా చిరకాలం జీవిస్తారని సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు అన్నారు. బుధవారం న్యాయమూర్తులు వాసుదేవరావు, కార్తీక్, సింధు, సిబ్బంది, న్యాయవాదులు కలసి యోగా దినోత్సవం నిర్వహించారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ నారాయణ యోగాసనాలు వేశారు. న్యాయమూర్తి వాసుదేవరావు మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా చేయాలన్నారు.

చౌడేపల్లె: శారీరక మానసిక ప్రశాంతతకు యోగా దోహదపడుతుందని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తో కలిసి ఆయన యోగాసనాలు వేశారు. మాజీ ఎంపీపీలు అంజిబాబు, రెడ్డిప్రకాష్, రుక్మిణమ్మ, ఎంపీడీఓ సుధాకర్, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పులిచెర్ల(కల్లూరు): నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ తులసీరాం విద్యార్థులతో వివిధ ఆసనాలు వేయించారు. ఎన్ఎస్ఎస్ పీఓ అశోక్ కుమార్, హైమావతి, లావణ్య, హేమలత, రాజేశ్వరి, రఫీ, కావ్య, గోవిందు రమణ పాల్గొన్నారు.

సోమల: నంజంపేట, సోమల ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం కుసుమాంబ, పీఈటీ కరుణానిధి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జయరాం పాల్గొన్నారు.

సదుం: వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల లో ప్రిన్సిపల్ యశిష్ట విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. యోగా సాధన చేయాలని సూచించారు.

రొంపిచెర్ల: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓలు హసన్‌బాషా, శ్రీనివాసులు, పీహెచ్‌సీ డాక్టర్లు రాజ, దినేష్ కుమార్ నాయక్, సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, సుధారాణి పాల్గొన్నారు.



పుంగనూరు: కోర్టు ఆవరణలో యోగా చేస్తున్న న్యాయమూర్తులు వాసుదేవరావు, కార్తీక్, సింధు



పెద్దపంజాణిలో..



చౌడేపల్లెలో..



సోమల: ఆసనాలు వేస్తున్న విద్యార్థులు



సదుం: అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ యశిష్ట



రొంపిచెర్ల: పీహెచ్‌సీలో..

ఆర్థిక సాక్షరతపై క్విజ్ పోటీలు





శాంతిపురం : ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులతో బ్యాంకు అధికారులు, ఉపాధ్యాయులు, గుడుపల్లెలో..

శాంతిపురం: ఆర్థిక సాక్షరతపై రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని 12 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, హెచ్‌ఎంలు నటరాజ రెడ్డి, తీగల వెంకటయ్య పోటీలను నిర్వహించారు. మొదటి బహుమతి రూ.5వేల విజేతలుగా శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వి.గీతి కాసాయి, బి.విశాల్‌రెడ్డి, ద్వితీయ బహుమతి (రూ.4 వేలు) విజేతలుగా మోడల్ స్కూలు విద్యార్థులు ఇందుజ, మీణ, తృతీయ బహుమతి (రూ.3వేలు) విజేతలుగా శెట్టిపల్లె జెడ్పీ హైస్కూలు విద్యార్థులు శాలిని, ధనుష్ నిలిచారు. విజేతలకు నగదు బహుమతులను వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని నిర్వాహకులు చెప్పారు. అలాగే వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. మొదటి బహుమతి పొందిన విద్యార్థులు ఈ నెల 26న నిర్వహించే జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

గుడుపల్లె: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన క్విజ్ పోటీలలో గుత్తర్లపల్లె విద్యార్థులు మీనా, సాగర్ ప్రతిభ చాటారు. వీరిని ఎంపీడీఓ రమణ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, టీచర్‌శిరీష పాల్గొన్నారు.

పలమనేరు: విద్యార్థులు బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక ఇండియన్ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ కోరారు. ఆర్‌బీఐ సేవలపై బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారికి సర్టిఫికెట్లను అందజేసి ఆయన మాట్లాడారు. డిగ్రీలు, పీజీలు చదివిన వారికి సైతం బ్యాంకు సేవలపై అవగాహన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులకు సంబంధించిన ఫారాలను చదువుకున్న వారికి సైతం సరిగా రాయడం కూడా తెలియదని పేర్కొన్నారు.. అందుకే విద్యార్థి దశ నుంచే బ్యాంకు సేవలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది రమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పలమనేరులో..



కల్లూరు జెడ్పీహైస్కూల్లో..

పులిచెర్ల(కల్లూరు): విద్యార్థులు బ్యాంకింగ్ రంగంపై సరైన అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఇండియన్ బ్యాంక్ పులిచెర్ల శాఖ మేనేజర్ సురేష్ తెలిపారు. కల్లూరు జెడ్పీ హైస్కూల్లో బుధవారం మండలంలోని ఐదు హైస్కూళ్ల విద్యార్థులకు నేషనల్ సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ ఎడ్యుకేషన్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి మూడు బహుమతులు సాధించిన వారికి రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు చొప్పున వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. అలాగే ప్రశంసా పత్రం అందజేశారు. మొదటి స్థానం పొందిన వారు జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య, కల్లూరు ఇండియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ పృథ్వీతేజ, ఉపాధ్యాయులు వెంకటసిద్దులు, రాజేంద్ర, ప్రకాష్, సురేష్ పాల్గొన్నారు.

పలమనేరులో భారీ వర్షం



నాగమంగళం వద్ద హైవేలో నిలిచిన నీరు

పలమనేరు: నైరుతి రుతుపవనాల రాకతో పలమనేరులో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు పల్లపు ప్రాంతాలకు వర్షపు నీరు చేరింది. గాలులకు చెట్లు నేలకూలాయి. పట్టణ సమీపంలోని నాగమంగళం చెన్నై– బెంగళూరు హైవేపై ఓవర్ వద్ద భారీగా వర్షపునీరు చేరి చెరువులా మారింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. మరో వైపు నాగమంగళంలోని వీధుల్లో వర్షపు ప్రవాహంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని మొరం వద్ద నక్కపల్లెకు చెందిన క్రిష్ణారెడ్డి బీరతోట పూర్తిగా నేలవాలింది. దీంతో రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్టు బాధిత రైతు తెలిపారు. మండలంలో తీగపంటలు పది ఎకరాల్లో దెబ్బతిన్నాయి. వర్షం కారణంగా టమాటాల నాణ్యత తగ్గే అవకాశం ఉందని, అయితే వేరుశనగ విత్తనాలేసేందుకు మంచి అదును ఇదేనని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వడ్డెరల ధర్నా

- రెక్కలబండపై హక్కులు కల్పించాలని డిమాండ్



ధర్నా చేస్తున్న కృష్ణాపురం పంచాయతీ ప్రజలు

వి.కోట: మండలంలోని కృష్ణాపురం పంచాయతీ యడగురికి గ్రామ సమీపంలోని రెక్కబండపై హక్కులను వడ్డెరలకే కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆ పంచాయతీ ప్రజలు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ, రెక్కబండపై వడ్డెలకే హక్కులను కల్పించాలని గతంలో రెవెన్యూ అధికారులకు వినతులు ఇచ్చామన్నారు. బండకు తీసుకున్న లీజు కాలపరిమితి ముగిసిందని, అయితే మళ్లీ వారికే లీజు ఇవ్వడం తగదన్నారు. కుటుంబ పోషణకు బండపై ఆధారపడిన వడ్డెరలకే పూర్తి హక్కులను కల్పించి, ఆదుకోవాలని వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, మంజునాథ్, బాబు, సురేష్, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కాంక్రీట్ లారీ



కుప్పం రూరల్: కుప్పం ప్రాంతం నుంచి తమిళనాడుకు కాంక్రీట్ మిశ్రమాన్ని తీసుకెళ్తున్న లారీ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. బుధవారం మధ్యాహ్నం నడుమూరు వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. డ్రైవర్ పెరుమాల్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. సాయంత్రం లారీని వెలికితీశారు.

రేపటి నుంచి మహాభారత యజ్ఞం

సదుం: మండలంలోని భట్టువారిపల్లె భారతం మిట్ట వద్ద పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం ఈ నెల 23వ తేదీ నుంచి మహాభారత యజ్ఞం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు చెప్పారు. ఇందులో భాగంగా 18 రోజుల పాటు మధ్యాహ్నం హరికథా కాలక్షేపం, రాత్రి నాటక ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

23, 24న పెద్దిరెడ్డి 'పల్లెబాట'

గుడుపల్లె: రాష్ట్ర భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 23, 24న మండలంలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించనున్నారని చిత్తూరు ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ తెలిపారు. 23న శుక్రవారం బెగ్గిలిపల్లె, శెట్టిపల్లె, పీబీ వాడ, యామగానిపల్లె, కనమనపల్లె గుండ్లసాగరం, అగరం, దాసిమానిపల్లె పొగురుపల్లెల్లో ఆయన పర్యటిస్తారు. 24న శనివారం సోడిగానిపల్లె, చీకటిపల్లె, సంగనపల్లె, చిన్న గొల్లపల్లె, కొడతనపల్లె, కుప్పిగానిపల్లె, గుడుపల్లెలో బహిరంగ సభ నిర్వహించనుననట్లు పేర్కొన్నారు.

26, 27న రామకుప్పం మండలంలో..

రామకుప్పం: ఈ నెల 26, 27వ తేదీలలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రామకుప్పం మండలంలో పర్యటించనున్నట్లు చిత్తూరు ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త భరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న సోమవారం ఉదయం 9 గంటలకు పంద్యాలమడుగు, పీఎంకే తండా,10 గంటలకు గొరివిమాకుల పల్లె,11 గంటలకు బందార్లపల్లె,12 గంటలకు ముద్దనపల్లె, నారాయణపుం తండా, మధ్యాహ్నం ఒంటి గంటకు మణీంద్రం, 2గంటలకు సింగసముద్రం, 3గంటలకు రాజుపేట, బైపరెడ్డపల్లె, 4 గంటలకు చెల్దిగానిపల్లె, సాయంత్రం 5 గంటలకు కొంగనపల్లె గ్రామాల్లో మంత్రి పర్యటిస్తారు. అలాగే 27న మంగళవారం ఉదయం 9 గంటలకు 89 పెద్దూరు, ననియాల తండా, 10 గంటలకు వీర్నమల, పెద్దతండా, గుట్టూరుతండా, చిక్కపల్లి తండా, 11 గంటలకు బళ్ల, మధ్యాహ్నం 12 గంటలకు ఉన్సిగానిపల్లె, మధ్యాహ్నం ఒంటిగంటకు విజలాపురం, 2 గంటలకు కెంచనబళ్ల, 3గంటలకు రామకుప్పంలో బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రి పర్యటనను ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని భరత్ కోరారు.

మంత్రి పర్యటన విజయవంతం చేయండి –చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప



మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడి రామచంద్రారెడ్డి పర్యటనకు విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 23న గుడుపల్లె మండలం బెగ్గిలపల్లె గ్రామ పంచాయతీలో మంత్రి పర్యటన ప్రారంభమవుతుందని , రెండ్రోజుల పాటు మండలంలోని 18 పంచాయతీల్లో, అలాగే 26, 27న రామకుప్పం మండలంలోని 23 పంచాయతీల్లో ఆయన పర్యటన కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు మొగశాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్

పులిచెర్ల(కల్లూరు): వార్డు, సచివాలయాల్లో జారీ చేసే వివిధ రకాల సర్టిఫికెట్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జగనన్న సురక్షపై ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలన్నారు. అన్ని రకాల సర్టిఫికెట్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీలో అనుబంధ విభాగ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. నేతలు రెడ్డీశ్వరరెడ్డి, ముర్వత్‌బాషా, నాధమునిరెడ్డి, పోకల చంద్ర, హేమసుందరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, దామోదర్, కృష్ణయ్య, ప్రభాకర్, గోవర్ధన్, రవీంద్రారెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



విద్యార్థినికి నోట్ పుస్తకాలను ఇస్తున్న అశోక్ దంపతులు

వి.కోట: విద్యాభివృద్ధికి దాతలు చేస్తున్న సహాయ సహకారాలు వెలకట్టలేమని మోట్లపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నందగోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని మోట్లపల్లెకు చెందిన అమరావతి, అశోక్ దంపతులు 25 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు, కాపీ రైటింగ్ బుక్స్, ఇతర త్రా వాటిని వితరణ చేశారు. అశోక్ మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి తమ వంతు సాయం చేస్తున్నామని, చదువుల్లో రాణిస్తూ విద్యార్థులు స్కూలుకు, గ్రామానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సదస్సుకు తరలిరండి



మాట్లాడుతున్న నరసింహులు

పుంగనూరు: చిత్తూరు జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో గురువారం జరిగే సదస్సుకు తరలిరావాలని ఆ సమితి నాయకుడు నరసింహులు కోరారు. బుధవారం ఆయన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణతో పాటు అణగారిన వర్గాలకు రాజ్యాధికారం సాధించేందుకే ఉమ్మడి జిల్లాల సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాగభూషణం, వెంకట్రమణ, గోవిందు, రామనాథం, నారాయణ, బుడ్డన్న, బాబు, గంగులప్ప, ఆనంద, శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోమేటిక్ నియంత్రణ వ్యవస్థ



విద్యుత్ దీపాలకు ఆటోమేటిక్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కుప్పంరూరల్: విద్యుత్ ఆదాలో భాగంగా విద్యుత్ దీపాలకు ఆటోమేటిక్ కంట్రోల్ సిస్టమ్ (నియంత్రణ వ్యవస్థ)ఏర్పాటు చేస్తున్నట్లు రెస్కో ఎండీ సుబ్రమణ్యం చెప్పారు. ప్రయోగాత్మకంగా బుధవారం పట్టణంలోని రెస్కో కార్యాలయం ఎదుట కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఎండీ మాట్లాడుతూ, విద్యుత్ దీపాలు కొన్ని మార్లు రోజంతా వెలుగుతూ ఉండడం వల్ల వృథా అవుతోందని, తద్వారా పంచాయతీలపై అదనపు భారం పడుతోందన్నారు. దీన్ని నిరోధించేందుకు ఆటోమేటిక్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం చీకటి పడగానే దీపాలు వాటంతట అవే ఆన్ అవుతాయని, ఉదయం వెలుతురు రాగానే ఆఫ్ అవుతాయని చెప్పారు. ఇవి సత్ఫలితాలిస్తే అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీ ప్రభాకర్, ఏ ఈ మునిరత్నం, ఎల్‌ఐ స్వామినాథన్, లైన్‌మెన్లు కాంతరాజ్, మురుగ, మంజు, మగీ ఉన్నారు.

నెలాఖరులోపు పూర్తి చేయాలి

చౌడేపల్లె: ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకం పనులను జూన్ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో 350 ఎకరాలు పండ్ల తోటల పెంపకం పనులు చేసుకోవచ్చన్నారు. ఇదివరకే పనులు ప్రారంభించిన రైతులు జూలై మొదటి వారంలోపు మొక్కలు నాటే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పనులు ప్రారంభించని రైతులు నెలాఖరులోపు గుంతలు తీసే ప్రకియను పూర్తి చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. హౌసింగ్ లబ్ధిదారులకు 90 పని దినాలు కల్పించి పురోగతి సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఓ శ్రీనివాసులు యాదవ్, శంకరయ్య, జేఈ ధనుంజయుడు, టీఏలు అమరనాథ్, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రాగి సాగుపై అవగాహన

చౌడేపల్లె: రైతులు రాగి పంట సాగుపై దృష్టి సారించేలా సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీ కృష్ణ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో డీడీఏ హబీబ్‌బాషా, పుంగనూరు ఏడీఏ శివకుమార్‌తో కలిసి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినదన్నారు. రైతు భరోసా కేంద్రాల అధికారులు గ్రామాల్లో ఈ విషయంపై రైతులకు చైతన్యం కల్పించాలన్నారు. రాగి పంట సాగు చేసిన రైతుల నుంచి ఆర్బీకేల్లో కిలో రూ.38 చొప్పున ప్రభుత్వమే రాగులను కొనుగోలు చేస్తుందన్నారు. రేషన్ షాపుల్లో ప్రజలకు రాగులు పంపిణీ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏఓ జ్యోతమ్మ పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు వస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. మండల స్థాయిలో అన్ని గ్రామాల నుంచి పార్టీ కోసం పని చేసిన నేతలకు పార్టీ అనుబంధ శాఖల కమిటీలో పదవులను కేటాయించి లబ్ధి చేకూర్చుతామన్నారు. 16 శాఖలకు చెందిన పదవులను పంచాయతీల వారీగా అన్ని కులాల వారికి లబ్ధి చేకూర్చడమే తమ ధ్యేయమన్నారు. పార్టీ నేతలు గ్రామాల్లో చురుగ్గా పనిచేసి రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించే దిశగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో దృశ్య కళల రాష్ట్ర డైరెక్టర్ అంజిబాబు, పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లడ్డూ రమణ, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సచివాలయ కన్వీనర్ రుక్మిణమ్మ, మాజీ ఎంపీపీ రెడ్డిప్రకాష్, సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచుల సంఘం మండల శాఖ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.